## క్లుప్తంగా

### తోపుడుబళ్ల వ్యాపారులకు గొడుగులు పంపిణీ



గొడుగులు అందజేస్తున్న దువ్వాడ శ్రీకాంత్

కాశీబుగ్గ: పట్టణంలో తోపుడుబళ్లపై పండ్ల వ్యాపారం చేసుకుంటున్న 120 మందికి సంఘ నాయకులు గొడుగులను ఆదివారం పంపిణీ చేశారు. వేసవిలో, వర్ష కాలంలో వ్యాపారులకు ఇబ్బంది లేకుండా గొడుగులను సమకూర్చామని తోపుడుబళ్ల వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. పలాస–కాశీబుగ్గ పట్టణంలోని మంకినమ్మ పండ్ల తోపుడు బళ్ల వర్తక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తకోట రమణ, సకలాబత్తుల తవుడు, బమ్మిడి చూడామణి, ఇంటివెనుక వీరాస్వామి పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

టెక్కలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తెలుగు భాష గొప్పతనం పై నిర్వహించిన పోటీల్లో అధికసంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు.

### భారత్ బచావో పోస్టర్ ఆవిష్కరణ



మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద భారత్ బచావో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బచావో జిల్లా కన్వీనర్ పేడాడ పరమేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో సంఘ పరివార్ శక్తులు ప్రజలను కష్టాల పాల్జేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీల పరం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు అరుణ, నాగమణి, నాయకులు వంకల మాధవరావు, తామడ త్రిలోచన, కోదండం దాసరి శ్రీరాములు పాల్గొన్నారు.

### దాతల సహకారంతో జిమ్ ఏర్పాటు



జిమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: హెల్పింగ్ వారియర్స్ బ్రాహ్మణతర్లా వారి ఆధ్వర్యంలో గ్రామంలో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవం కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జిమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దాతలు, సేవకులు, వారియర్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కవిటి: చిన్న ఎర్రగోవిందపుట్టుగకు చెందిన గోవింద భాగ్యం ఒంగోలు కిమ్స్ నర్సింగ్ కళాశాలలో చదువుతుంది. నిరుపేద కావడంతో చదువు కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న హైదరాబాద్‌కు చెందిన చింతామణి అమ్మవారి ట్రస్టు సభ్యులు ముందుకొచ్చి 20 వేల రూపాయలను సమకూర్చారు. ఈ మొత్తాన్ని విద్యార్థిని భాగ్యానికి కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆదివారం అందజేశారు. ట్రస్టు సభ్యులకు భాగ్యం కృతజ్ఞతలు తెలియజేసింది. కార్యక్రమంలో కవిటి గ్రామానికి చెందిన పి.శేఖర్, జన్ని లోకనాథం పాల్గొన్నారు.

### చంద్రబాబును ముస్లింలు నమ్మరు

కోటబొమ్మాళి: అధికారంలో ఉన్నప్పుడు ఎటువంటి మేలుచేయని చంద్రబాబును ముస్లింలు నమ్మేపరిస్థితి లేదని మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజూబాయ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు మేలు చేస్తామంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతూనే మరోపక్క బీజేపీతో స్నేహం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని మండిపడ్డారు. ముస్లింలను అన్నివిధాలా ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

# ఉత్సాహం ఉత్సవమై..



ఇచ్ఛాపురం:చందన పూజలు అందుకున్న స్వామివార్లు



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



సంతబొమ్మాళి: పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి



కవిటి: జగన్నాథస్వామికి నారికేళజలాలతో అభిషేకాలు చేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం



కంచిలి: మఠం కంచిలిలో జగన్నాథునికి నేత్రోత్సవం చేస్తున్న పురోహితులు



కాశీబుగ్గ: పూజలందుకుంటున్న స్వామివారు

టెక్కలి: ఉత్సాహం ఉత్సవంగా మారింది. ఊరూరా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామదేవత సంబరాలు, జగన్నాథస్వామి చందనోత్సవాలతో ఆదివారం సందడి నెలకొంది. టెక్కలిలోని మెట్ట వీధి, నెల్లూరువీధిలో కిల్లిపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులంతా ముర్రాటలతో కిల్లిపోలమ్మ ఆలయానికి చేరుకుని దేవరను తీసుకువచ్చారు. అమ్మవారి ఊరేగింపులో డప్పు వాయిద్యాలకు యువకులు పెద్ద ఎత్తున తీన్‌మార్ డ్యాన్సులు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.

**కాపుగోదాయవలసలో..**

సంతబొమ్మాళి: కాపుగోదాయవలస గ్రామంలో గోదావరి పోలమ్మతల్లి గ్రామదేవత సంబరాలను ఘనంగా నిర్వహించారు. టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ గ్రామదేవతను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ ఎ.లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.జనార్దన్, వి.సింహాచలం, ఎ.మల్లేషు ఉన్నారు.

**కమనీయం జగన్నాథుని జేష్టాభిషేకం**

కవిటి: కవిటి పట్టణంలో వెలసిన జగన్నాథస్వామి ఆలయంలో జేష్టాభిషేకం ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. జేష్ట పౌర్ణమి రోజున జగన్నాథునికి పవిత్రజలాలతో పాటు పంచామృతాలు, నారికేళ జలాలతో దైవస్నానం ఆచరించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా సుభద్ర, బలభద్రసమేత జగన్నాథస్వామికి జేష్టాభిషేకంలో భాగంగా పురోహితులు, అర్చకులు వేదమంత్రాల నడుమ షోడశోపచారపూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. ఈ జేష్టాభిషేకం నాటినుంచి 15 రోజుల పాటు జగన్నాథస్వామి దర్శనం భక్తులకు ఉండదు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. జగన్నాథ భక్తసమాజం ఆధ్వర్యంలో సంగీత గాత్రకచేరీ నిర్వహించారు.

**స్వామికి చందనోత్సవం**

ఇచ్ఛాపురం: జగన్నాథస్వామి చందనోత్సవాన్ని ఇచ్ఛాపురం ఆలయంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జేష్టపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. సాధారణంగా మూలవిరాట్‌కు ఆలయం గర్భగుడిలో ఇటువంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కానీ ఈ కార్యక్రమంలో భాగంగా గర్భ గుడిలోపల నుంచి నూతన వస్త్రాలతో అలంకరించిన దేవతామూర్తులను భక్తుల మధ్యలో నుంచి జేష్టమండపానికి తీసుకొచ్చి సుగంధద్రవ్యాలను మిళితం చేసిన శ్రీ చందనంతో దేవతామూర్తులకు పూసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం ప్రత్యేకత. అనంతరం ముఖాలను పూర్తిగా మూసివేసి 15 రోజుల పాటు చీకటి గదిలో ఉంచుతారు. ఈ కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో స్వామివారిని ఉక్కలోవేయడం అని అంటారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ బి.రామారావు, వార్డు కౌన్సిలర్ బచ్చ జగన్నాథం, భక్తులు పాల్గొన్నారు.

కంచిలి: జగన్నాథస్వామి నేత్రోత్సవం కంచిలి, జలంత్రకోట, కొల్లూరు గ్రామాల్లోని ఆలయాల్లో ఘనంగా జరిగింది. జ్యేష్టపౌర్ణమి సందర్భంగా స్వామివారికి వేదమంత్రాలతో అభిషేకించి, శాస్త్రోక్తంగా నేత్రోత్సవాన్ని నిర్వహించారు. మఠం కంచిలిలోని జగన్నాథ స్వామి ఆలయంలో ట్రస్టీ జానకీరాం దాస్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కాశీబుగ్గ: జేష్ట పౌర్ణమి సందర్భంగా స్థానిక జగన్నాథస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ రామాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ కార్యవర్గ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు పంచాయతీలో గ్రామదేవతలైన డొంకపోలమ్మ, అసిరిపోలమ్మ అమ్మవార్ల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సంబర మహోత్సవంలో అమ్మవారి నైవేద్యంగా భావించే గజముద్దను కాళీమాత వేషధారణలు, మేళతాళాల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## టెన్త్ పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న సంఘ నాయకులు

కాశీబుగ్గ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాణించిన విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులను సంఘం తరపున ఆదివారం సత్కరించారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో కంపోస్ట్ కాలనీలో గల విశ్వబ్రాహ్మణ సామాజిక భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 60 మంది విద్యార్థులను సత్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయ ఆచారి, ప్రధాన కార్యదర్శి, ప్రముఖ డాక్టర్ తాళాబత్తుల బాలకృష్ణ, విద్యా సంస్థల అధినేత చేబోలు దుర్గాప్రసాద్, ఎంఆర్ సీహెచ్ కుమార్, పలాస నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి చిన్నాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్రాల విష్ణు మాస్టర్, గౌరవ అధ్యక్షులు సింహాద్రి గోపాలకృష్ణ, కోశాధికారి అనుకోదు శ్రీధర్ మాట్లాడారు. 589 మార్కులు సాధించిన వమరవెల్లి హన్సికకు రూ.5016, 585 మార్కులు తెచ్చుకున్న పోలాకి వేదవేశ్‌కు 2016 రూపాయలను డాక్టర్ బాలకృష్ణ అందజేశారు. అలాగే ఏటా ఉత్తమ మార్కులు సాధించే ముగ్గురికి బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.

## జేవీకే కిట్ల పంపిణీకి చర్యలు



జేవీకే కిట్ల పంపిణీని పరిశీలిస్తున్న ధనంజయమజ్జి

కవిటి: జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఈవో ధనంజయమజ్జి తెలిపారు. కవిటిలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన కిట్లను పరిశీలించి.. పంపిణీ చేపట్టారు. సమగ్రశిక్షా సిబ్బంది ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీలోగా అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కిట్లను చేరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

## బాలుకి ఘన నివాళి



ఇచ్ఛాపురం: బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు



సోంపేట: నివాళులర్పిస్తున్న సంగీత కళాకారులు

ఇచ్ఛాపురం: ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 77వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక కళాకారులు ఆదివారం నిర్వహించారు. వెంకటేశ్వర డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ, మణికంఠ మ్యూజికల్ ఈవెంట్ సభ్యుల ఆధ్వర్యంలో ఏడు మండలాలకు చెందిన కళాకారులు స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వల్లంపాటి మూర్తి, దుర్గాగురుస్వామి, కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం జోనల్ కమిటీ అధ్యక్షుడు పి.సోమేశ్వరరావు, స్వేచ్ఛా నృత్య తరంగిని అధ్యక్షుడు కె.గోవిందరావు, స్థానిక గాయకులు ఎంకే రావు, మణికంఠ, హరిప్రసాద్, సంగీత వాయిద్య కళాకారులు హేమంత్, నితిన్, హరిదాస్ పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో మండల సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచం నలుమూలల చాటి చెప్పిన మహనీయుడు బాలు అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, కళాకారులు దేవేంద్రనాథ్ పండా, మద్దిలి హేమసుందర్, లోపింటి కామేశ్వరరావు, ముప్పన ఈశ్వరరావు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట



జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురం గ్రామంలోని ఉమాసహిత భువనేశ్వరి స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా రెండో రోజైన ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహమూర్తులకు జలాభిషేకంతో పాటు పలు పూజలు చేశారు. రుత్వికుల మంత్రోచ్ఛారణల మధ్య విశేష హోమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను తిరువీధి చేపట్టగా.. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## దాతలకు సత్కారం



దాతలను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

వజ్రపుకొత్తూరు రూరల్: దాతల సహకారంతోనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. డోకులపాడు గ్రామంలో సుమారు రూ.27 లక్షల వ్యయంతో నిర్మించిన గణనాథుని ఆలయం, గ్రామ దేవత ఉత్సవాలకు ఆర్థిక సహకారం అందించిన బిలాయ్, కాండ్ల, విశాఖపట్నం, అండమాన్, సైనిక సేవాదళ్, లిటిల్ అండమాన్, జనసేన సమితి, వివిధ సంఘాల ప్రతినిధులు, వ్యక్తిగతంగా సాయం అందించిన దాతలను ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసి గౌరవించారు. గ్రామ ప్రగతికి దాతలు ముందుకు రావాలని గ్రామ పెద్దలు కోరారు.

## ఈదురు గాలుల బీభత్సం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో ఆదివారం సాయంత్రం వర్షంతో పాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల ప్రభావంతో మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం వాటిల్లింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, గాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ శాఖాధికారులు ముందస్తుగానే సరఫరాను నిలిపివేశారు.

## జస్టిస్ గురుగుబెల్లికి సన్మానం



జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులును సన్మానిస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి గౌరవ పురస్కార గ్రహీత జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులును నారాయణ తిరుమల క్షేత్రం వద్ద గల ఆయన స్వగృహంలో పలువురు న్యాయవాదులు ఆదివారం సన్మానించారు. యతిరాజులుకు అరుదైన, గౌరవప్రదమైన నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి గౌరవ పురస్కారం రావడం పట్ల న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేశారు. న్యాయవాదులు మట్లాడుతూ జిల్లాలో చదవి, న్యాయవాదిగా వృత్తిని చేపట్టి, జిల్లా జడ్జిగా ఎంపికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా పనిచేశారన్నారు. ఎన్నో సంస్థలకు, ఎంతో మందికి మార్గదర్శిగా ఉన్న యతిరాజులు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గురుగుబెల్లి మట్లాడుతూ ఏ వృత్తిలోనైనా, ఏ రంగంలోనైనా కష్టపడి పని చేస్తే తప్పనిసరిగా మంచి ఫలితాలు వస్తాయన్నారు. తన తండ్రి ప్రోత్సహంతోనే లా కోర్సు పూర్తి చేశానని, పట్టుదలతో చదవడం వల్లే హైకోర్టు జడ్జిగా ఉన్నత స్థానంలో నిలిచానన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, బీసీ న్యాయవాదుల జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, న్యాయవాదులు కూన అన్నంనాయుడు, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## కొండమహంకాళి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మోట్టూరు పంచాయతీ పరిధి ఒంకులూరు గ్రామంలో వెలసిన కొండమహంకాళి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ఆరంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి కలశ పూజలు చేసి ఊరేగించారు. గొడాబల్లు అమ్మవారికి, మరిడమ్మవారికి మేళతాళాల నడుమ ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా దేశ రక్షణలో సేవలు అందిస్తున్న సైనికులకు ఆదిబలిజ సంఘం అధ్యక్షుడు అండ శ్రీను ఆధ్వర్యంలో సన్మానించారు. వల్లభ మాస్టార్ నేతృత్వంతో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పారిశ్రామిక వేత్త గుంటు వేణు, జోగి అప్పారావు, లండ భోజరావు, ఈశ్వరరావు, నేతా జగన్నాథం, వల్లభరావు పాల్గొన్నారు.

## మృతురాలి ఆచూకీ లభ్యం

కోటబొమ్మాళి: కన్నెవలస పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళ వివరాలను పోలీసులు సేకరించారు. ఈమెది మందస మండలం పద్మపురం గ్రామానికి చెందిన సవర అరుణకుమార్ అలియాస్ లక్కీ(16)గా గుర్తించారు. ప్రస్తుతం టెక్కలి ఆది ఆంధ్రా వీధిలో నివాసం ఉంటుంది. హిజ్రాగా మారి రాత్రి వేళల్లో దాబాల వద్ద యాచక వృత్తి చేసుకుంటూ జవనం సాగిస్తుండేదని చెప్పారు. శనివారం రాత్రి కూడా వృత్తిలో భాగంగా రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మహ్మద్‌అలీ తెలిపారు.

## 7 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో గల భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు, ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న స్వామివారికి కల్యాణం, 8న నారాయణ సేవ, సామూహిక కుంకుమార్చనలు, కోలాటం ప్రదర్శన, 9న స్వామివారికి పుష్పయాగ మహోత్సవం, భక్తి సంగీత విభావరి జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## వైభవంగా త్రిశూల తీర్థ స్నానం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధిలో గల ఉమారుద్రకోటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా ఆదివారం 'త్రిశూలతీర్థ' స్నానాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జ్యేష్టశుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉమాసమేత రుద్రకోటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు నాగవెల్లి పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సమూర్తులను పల్లకిలో ఉంచి ప్రధాన ఆలయం చూట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి, ఊరేగింపుగా నాగావళి నది తీరానికి చేర్చి అక్కడ పూజలు చేశారు. నదిలోనికి ఉత్సమూర్తులను తీసుకెళ్లి త్రిశూల తీర్థ స్నానాలు నిర్వహించారు.

# విహారయాత్రలకు స్పెషల్ సర్వీసులు

● ఆర్టీసీ డీపీటీఓ విజయ్‌కుమార్



విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్‌ఆర్టీసీ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఈ నెల 10, 17వ తేదీల్లో భీమునిపట్నం బీచ్ నుంచి బొర్రా గృహలకు సంబంధించి స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ బస్సులు శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి భీమునిపట్నం బీచ్, కైలాసగిరి, తిరుపతి దేవస్థానం దర్శింప చేసి, ఎస్.కోట మీదుగా అరుకు వెళ్లి.. అరకులో రాత్రి బస చేస్తాయన్నారు. విహార యాత్రికులకు అరుకులో లాడ్జింగ్, డిన్నర్ ఏర్పాటు చేస్తామన్నారు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు బయలుదేరి పద్మావతి గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, కాఫీ హౌస్, బొర్రా గృహలు చూపించి సాయంత్రం 6 గంటలకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందన్నారు. ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.2,500 చార్జి నిర్ణయించినట్లు తెలిపారు.

**గోపాలపురం బీచ్–చిలక సరస్సు..**

శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి ఈ నెల 10, 17 తేదీల్లో ఉదయం 6 గంటలకు బయలుదేరి గోపాలపురం బీచ్.. అక్కడ నుంచి చిలక సరస్సులో గల ప్రసిద్ధ మహా కాళీ ఆలయాన్ని దర్శింపజేస్తామన్నారు. మరలా సాయంత్రం 6 గంటలకు బయలుదేరి శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు చేరవేస్తామన్నారు. ఈ యాత్రకు సంబంధించి ఒక్కొక్క ప్రయాణికుడికి రూ.1,500 చార్జి నిర్ణయించామన్నారు.

**పూరి జగన్నాథ రథయాత్రా స్పెషల్..**

పూరి జగన్నాథ రథయాత్ర సందర్భంగా ఈ నెల 19వ తేదీ సోమవారం శ్రీకాకుళం నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారని తెలిపారు. ఈ యాత్ర 19వ తేదీ రాత్రి 8 గంటలకు శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి బయలుదేరి 20వ తేదీ ఉదయం 6 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుందన్నారు. అక్కడ కాల కృత్యాలు తీర్చుకొని భువనేశ్వర్‌లో గల లింగరాజు ఆలయాన్ని దర్శింపజేసి.. అక్కడ నుంచి 10 గంటలకు కోణార్క్ సూర్య దేవాలయం దర్శింపజేస్తామన్నారు. అనంతరం పూరియాత్రకు సాయంత్రం నాలుగు గంటలకు చేర్చుతామన్నారు. మరలా రథయాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు పూరి నుంచి బస్సు బయలుదేరి 21వ తేదీ ఉదయం శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు సంబంధించి ఒక్కొక్క ప్రయాణికుడికి చార్జి రూ.2,200 నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్‌టీసీఆన్‌లైన్.ఇన్‌లో కూడా టిక్కెట్‌లు లభిస్తాయన్నారు. మరిన్ని వివరాలకు 73829 21647, 99592 25608, 99592 25609, 73829 17289, 73829 19694 సంప్రదించవచ్చన్నారు.